కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 55, బెండ 40, కాకర 50, దొండ 60, దోస 40, ఆలు 35, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్‌ 50, బీట్‌రూట్‌ 50, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 20, క్యారెట్‌ 50, చిక్కుడు 50, ఉల్లి 50(కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్‌ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 400.

స్టడీ మెటీరియల్‌ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందిస్తున్న రవికుమార్‌ యాదవ్‌

గచ్చిబౌలి: గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్‌లో సందయ్య మెమోరియల్‌ ట్రస్ట్‌, ఆర్‌కేవై ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్‌ అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జ్‌ సందయ్య మెమోరియల్‌ ట్రస్ట్‌ సెక్రటరీ ఎం.రవికుమార్‌ యాదవ్‌ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ప్రయత్నిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని చెప్పారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాపిరెడ్డినగర్‌లో ఆక్రమణల తొలగింపు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లో రోడ్లపై ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం తొలగించారు. కాలనీలోని ప్రధాన రోడ్డుతో పాటు పలు మార్గాల్లో రోడ్లను ఆక్రమిస్తూ వేసిన షెడ్లను, ఇతర వ్యాపార సముదాయాలను శేరిలింగంపల్లి టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు జేసీబీలతో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలను కొనసాగించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలగడంతో అధికారులు చర్యలు చేపట్టారు. 30 ఆక్రమణలను తొలగించినట్లు ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

సైబర్‌ మోసం.. 1930కి కాల్‌ చేయాలి

- రూ.1,50,000 వేల వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చు
- సీఐ సామల వెంకట్‌రెడ్డి

మోతీనగర్‌: సైబర్‌ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్‌ చేయాలని అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ సీఐ సామల వెంకట్‌రెడ్డి సూచించారు. సైబర్‌ క్రైమ్‌ ఫిర్యాదుల స్వీకరణ విషయంలో సైబరాబాద్‌ సీపీ అవినాష్‌ మహంతి కొత్త ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గతంలో 50 వేల వరకు జరిగే మోసాలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరించేవారని, ప్రస్తుతం 1లక్ష 50 వేల రూపాయల వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయండి

జోనల్‌ కమిషనర్‌కు కార్పొరేటర్‌ వినతి

పటాన్‌చెరు టౌన్‌: డివిజన్‌లో సీసీ రోడ్లకు నిధులు మంజూరు, ఓపెన్‌ జిమ్‌లు ఏర్పాటుకు కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ శనివారం జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని, రోడ్లు దెబ్బతిని కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అదేవిధంగా డివిజన్‌ పరిధిలోని మైత్రి క్రీడా మైదానం, కృషి డిఫెన్స్‌ కాలనీలలో నూతన ఓపెన్‌ జిమ్‌ నిర్మించాలని కోరారు. 6 కోట్ల రూపాయల వ్యయంతో గాంధీ థీమ్‌ పార్క్‌, ప్రభుత్వ ఆసుపత్రి పక్కన గల క్రీడం పార్కులను నిర్మించడం జరిగిందని వాటికి తాళాలు వేశారని, వెంటనే రెండు పార్కులను తెరిపించి, ప్రజలకు అందుబాటులో తీసుకోరావాలని తెలిపారు. దీనికి జోనల్‌ కమిషనర్‌ సానుకూలంగా స్పందించాలని కార్పొరేటర్‌ తెలిపారు.

ముగ్గుల పోటీలు

శేరిలింగంపల్లి: సంక్రాంతిని పురస్కరించుకొని ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, కొమిరిశెట్టి ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి పరిధిలోని హుడా ట్రేడ్‌ సెంటర్‌, విభావరి అపార్ట్‌మెంట్స్‌, ఎంఐజీ కాలనీ మహిళా మండలి కార్యాలయం, హఫీజ్‌పేట్‌ డివిజన్‌ భారతి మహిళా మండలిలో శనివారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ టి రామస్వామి యాదవ్‌, వరలక్ష్మి, అనూష, జ్యోతి, బీఎస్‌రెడ్డి రాజేష్‌, వాణి సాంబశివరావు, శాంతకుమార్‌, అమ్మయ్యచౌదరి పాల్గొన్నారు.



ఈర్ల చెరువు మురుగుమయం..

ఆగిన సుందరీకరణ పనులు • అస్తవ్యస్తంగా పార్కు.. కానరాని అభివృద్ధి

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని ఈర్ల చెరువు మురుగుమయంగా మారింది. చెరువు సుందరీకరణలో భాగంగా చేపట్టిన అలుగు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇక చెరువు వద్ద ఏర్పాటు చేసిన పార్కును సొంత నిధులతో అభివృద్ధి చేస్తానన్న నగర మేయర్‌ ఇచ్చిన మాట మరిచారు. దీంతో ఈర్ల చెరువు పార్కు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. పార్కులో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. చెరువు సుందరీకరణ అంటూ నిధులు వెచ్చించినా 200 మీటర్ల వాకింగ్‌ ట్రాక్‌ తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదు. పార్కు అభివృద్ధికి లక్షలాది రూపాయలు కేటాయించినప్పటికీ ఆ దిశగా పనులు జరగడం లేదని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈర్ల చెరువు పార్కులోని వాకింగ్‌ ట్రాక్‌కు ఇరువైపులా చెట్లు పెరిగిపోయాయి. ఇక రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా మారింది. పార్కు అభివృద్ధికి మేయర్‌ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాలి



ఈర్ల చెరువు పార్కుపై జీహెచ్‌ఎంసీ మేయర్‌ ప్రత్యేక దృష్టి సారించాలి.పెండింగ్‌ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. పార్కును అందుబాటులోకి తేవాలి.

– అరవింద్‌, స్థానికుడు

పెండింగ్‌ పనులు పూర్తి చేయాలి



చెరువు సుందరీకరణలో భాగంగా అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉన్నతాధికారులు పట్టించుకోవాలి.

– జనార్దన్‌, మదీనాగూడ



అసంపూర్తిగా ఉన్న పనులు



వాకింగ్‌ట్రాక్‌



వాకింగ్‌ ట్రాక్‌లో మద్యం సీసాలు

నయనానందకరం.. నృత్య ప్రదర్శనలు



మాదాపూర్‌: ఒడిస్సీ నృత్యం సందర్శకులను ఆకట్టుకుంది. శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం వక్రతుండ, అభినయ, స్థాయి, మేఘ, పల్లవి, శబరి పల్లవి, బసంత్‌ పల్లవి, దుర్గస్తుతి, జగన్నాథ్‌ అష్టకం తదితర అంశాలను ఒడిస్సీ కళాకారులు తృప్తి, సుధాసాహు, దర్వి, ఇనాయ, చార్వి, అక్షిత, వర్ష పాండ, సుకన్య తదితరులు ప్రదర్శించారు.

కూచిపూడి నృత్యార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా గురుకులం మ్యూజిక్‌, డ్యాన్స్‌ అకాడమీ కూచిపూడి నృత్య గురువు పోపూరి లక్ష్మీ తులసి శిష్య బృందం నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కళాకారులు పోకూరి షణ్ముఖ వేద, శ్రీకృతి, అఖిల, సన్నుతి, ఆద్య, చిందా అలేఖ్య, కృతి, సంహిత, హర్షిత, చక్రిక, భవ్య, భావికలు.. ఆనందనర్తన గణపతి,



కొలువైతివా రంగసాయి, తక్కువేమి మనకు, అలరులు కురియగా, ముద్దుగారే యశోద, పలుకు తేనెల తల్లి, నారాయణతే అంశాలను ప్రదర్శించారు. అనంతరం కళాకారులను సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్‌ శోభారాజు, మేనేజింగ్‌ ట్రస్టీ నందకిషోర్‌లు జ్ఞాపికలను అందించి సత్కరించారు.

ఫిషింగ్‌ లింక్‌లు.. అప్రమత్తంగా ఉండాలి

పటాన్‌చెరు టౌన్‌: సైబర్‌ నేరస్తులు ఆదాయపు పన్ను శాఖ నుండి ఫిషింగ్‌ లింక్‌లను క్లెయిమ్‌ చేస్తూ మోసపూరిత సందేశాలను పంపుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పన్ను మినహాయింపు, డబ్బు వాపసు కోసం బ్యాంక్‌ ఖాతా వివరాలను ధ్రువీకరించడానికి ఫిషింగ్‌ లింక్‌పై క్లిక్‌ చేయండని సందేశాలు పంపుతారని, లింక్‌ని క్లిక్‌ చేస్తే వెబ్‌సైట్‌ లాగా కనిపించే వెబ్‌ పేజీకి డైవర్ట్‌ చేయగల లింక్‌ లు ఉంటాయని తెలిపారు. ప్రాసెస్‌ చేయడానికి ముందస్తు రుసుము లేదా వ్యక్తిగత సమాచారాన్ని అడుగుతారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో సమాచారాన్ని చెప్పకూడదన్నారు. ప్రతి ఒక్కరు లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

దోమల సమస్య.. చర్యలు తీసుకోవాలి



బటర్‌ఫ్లై సర్కిల్‌లో కాలనీవాసుల ఆందోళన

- నినదించిన కాలనీల ప్రజలు
- మున్సిపల్‌ కమిషనర్‌కు వినతి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో దోమలు ప్రబలాయని చర్యలు తీసుకోవాలంటూ పలు కాలనీల ప్రజలు నినదించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్‌ టౌన్‌షిప్‌ బటర్‌ ఫ్లై సర్కిల్‌లో ది సిటిజన్‌ కౌన్సిల్‌ కార్యదర్శి బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వారు శాంతియుతంగా ఆందోళన చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మున్సిపల్‌ కమిషనర్‌ డి. ప్రదీప్‌కుమార్‌ను కలిసి దోమలు, గుంతల రోడ్లు, ట్రాఫిక్‌ సమస్యపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రనాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నెక్నాంపూర్‌ పెద్ద చెరువు, చిన్న చెరువులలో మురుగునీరు కలవటం, పండెస్‌ వాగు ఓపెన్‌గా ప్రవహిస్తుండటంతో చుట్టుపక్కల కాలనీలలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్‌ రోగాలు వస్తున్నాయన్నారు.ఈ సమస్యపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేక ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. దోమల నివారణకు లక్షలు ఖర్చు పెట్టి తెచ్చిన ఫాగింగ్‌ మిషన్‌లను వృథాగా పడేశారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బి.పద్మారావు, ఎ.నవీన్‌కుమార్‌, కాలనీవాసులు సుజాత, ప్రసాద్‌, గణపతి, రాజు, జాఫర్‌, విజయభాస్కర్‌, స్వప్న, రాధిక, విజయలక్ష్మి, రూప, అనితలతో పాటు ది సిటిజన్‌ కౌన్సిల్‌ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, కార్యదర్శి షేక్‌ ఆరీఫ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు బి.శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాతృశ్రీనగర్‌, మాధవనగర్‌లోని కొంత ప్రాంతంలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

- 11కేవీ మాతృశ్రీనగర్‌ ఫీడర్‌ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాతృశ్రీనగర్‌లోని కొంత ప్రాంతం, విజయసూపర్‌ మార్కెట్‌ ప్రాంతంలో విద్యుత్‌ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అధికారులు వివరించారు.
- 11కేవీ విశ్వంభరకాలనీ, 11కేవీ శ్రీల ఫీడర్ల పరిధిలో.. విద్యుత్‌ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎస్‌ఎంఆర్‌, శ్రీల, కల్వరీ చర్చ్‌, విశ్వంభర, శిల్పా ఎవెన్యూ, వంటి ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి: రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్‌ జగదీశ్వర్‌గౌడ్‌ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్‌ నాయకులు ఉన్నారు.

సన్మానం



మహిళా టీచర్లను సన్మానిస్తున్న చైర్మన్‌ లక్ష్మణ్‌రావు

గచ్చిబౌలి: మహిళలు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సంస్కృతి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌ చైర్మన్‌ మంగళారపు లక్ష్మణ్‌రావు అన్నారు. సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకొని శనివారం సంస్కృతి పాఠశాలలో మహిళా టీచర్లను ఆయన ఘనంగా సత్కరించారు. మహిళా విద్యకోసం ఆమె చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌ ఆకుల భవాని, ప్రిన్సిపల్‌ సుబ్బలక్ష్మి, ప్రిన్సిపల్‌ జయంతి, వైస్‌ ప్రిన్సిపల్‌ బాలరాజు, టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానివ్వం

ఆల్విన్‌కాలనీ: యోగా భవనంలో లిఫ్ట్‌ అందుబాటులోకి వచ్చింది. వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని వివేకానందనగర్‌ కాలనీ వినాయక పార్కులో సీనియర్‌ సిటిజన్స్‌, మహిళల సౌకర్యార్థం ఎమ్మెల్యే గాంధీ స్వంత నిధులు 5 లక్షలతో నిర్మించిన లిఫ్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని పేర్కొన్నారు.

సంపూర్ణ, ఆధునిక విద్య అందించడమే లక్ష్యం

రాయదుర్గం: సంపూర్ణ, ఆధునిక విద్యను అందించడమే సాలిటైర్‌ బిజినెస్‌ స్కూల్‌ లక్ష్యమని స్కూల్‌ డైరెక్టర్‌ డానియల్‌ ముర్తుజా అలీ వెల్లడించారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలోని సాలిటైర్‌ బిజినెస్‌ స్కూల్‌లో 2022 బ్యాచ్‌ విద్యార్థుల అభినందన సభను 'హై ఫ్లైయర్స్‌ ఆఫ్‌ సాలిటైర్‌' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువగా బిజినెస్‌ స్కూళ్ళలో చదవడానికి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. అనంతరం 2022 బ్యాచ్‌ ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్న దీప్తాన్షు రితేష్‌, సయ్యద్‌ మహ్మద్‌హసన్‌, మహ్మద్‌ అబ్దుల్‌



2022 బ్యాచ్‌ విద్యార్థులను సన్మానించిన సిబ్బంది

నాఫియాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్‌ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

మియాపూర్‌: మియాపూర్‌ విశ్వనాథ్‌ గార్డెన్‌లో శనివారం శ్రీనిధి పాఠశాల 11వ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సీబీఐ మాజీ అధికారి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రతిరోజు పిల్లలతో గడిపేందుకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో అందరిని ఆకట్టుకున్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి, శ్రీనిధి గ్రూప్స్‌ చైర్మన్‌ మల్లపాటి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్‌ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్వరలో డబుల్‌ ఇళ్ల సమస్యలు పరిష్కరిస్తాం

అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కొల్లూరులోని డబుల్‌ ఇళ్లవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ బి.చంద్రశేఖర్‌ అన్నారు. శనివారం తెల్లాపూర్‌ మున్సిపల్‌ కార్యాలయంలో కొల్లూరు పరిధిలోని ప్రభుత్వ డబుల్‌ ఇళ్ల లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తమ కాలనీలో పారిశుద్ధ్యం, తాగునీటి, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌ మాట్లాడుతూ కాలనీకి బస్సు సౌకర్యంతో పాటు ఇంటి నంబర్‌లు కేటాయింపు, విద్యుత్‌, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే అంగన్‌వాడీ కేంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి



మాట్లాడుతున్న అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌

ఏర్పాటు చేస్తామని వివరించారు. అనంతరం మున్సిపల్‌ నిధులతో నిర్మిస్తున్న కల్యాణ మండపం , స్త్రీశక్తి మహిళా క్యాంటీన్‌ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్‌ సంగారెడ్డి, తహశీల్దార్‌ సంగ్రామ్‌ రెడ్డి, మున్సిపల్‌ డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ మౌనిక, సీడీపీఓ జయరాం నాయక్‌లు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్‌: మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్‌, మంజుల రఘునాథ్‌ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్‌, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్‌, మియాపూర్‌, హఫీజ్‌పేట, చందానగర్‌, భారతీనగర్‌ డివిజన్‌లలోని 203 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 3లక్షల ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌, మాజీ కార్పొరేటర్‌ అశోక్‌గౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాజుయాదవ్‌, గౌతమ్‌ గౌడ్‌, శ్రీనివాస్‌యాదవ్‌, అన్వర్‌ షరీఫ్‌, ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో 125 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకాల ద్వారా మంజూరైన ఒక కోటి 25 లక్షల రూపాయల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అరులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ తుమ్మల పాండురంగారెడ్డి, కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌, తహసీల్దార్‌లు రంగారావు, రాధ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఆల్విన్‌కాలనీ: సమస్యల పరిష్కారమే ధ్యేయం అని కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని సాయి ప్రశాంత్‌నగర్‌ ఫేజ్‌ 1, 2, కృష్ణవేణి కాలనీ, శ్రీరామ్‌నగర్‌ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై హెచ్‌యండబ్ల్యూఎస్‌ఎస్‌బి డీజీఎం, మేనేజర్‌, కాలనీవాసులతో కార్పొరేటర్‌ శనివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వాటర్‌వర్క్స్‌ డీజీఎం నాగప్రియ, మేనేజర్‌ ప్రశాంతి, లైన్‌మెన్‌ సాయి ప్రశాంత్‌ నగర్‌ ఫేజ్‌ 1, 2, కృష్ణవేణి కాలనీ, శ్రీరామ్‌నగర్‌ కాలనీవాసులు పాల్గొన్నారు.



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు తదితరులు